# సినీమానియాక్!

మైనంపాటి భాస్కర్

'వసంతకోకిల' సినిమా హాల్లో నిల్చుని ఉన్నాను. కమలహాసన్ పిక్చర్లు సరదాగా ఉంటాయని నాకు ఇష్టం. బుకింగ్ తెరవడానికి ఇంకా పావుగంట టైం ఉంది.

ఆ టైం సద్వినియోగం చెయ్యడానికి గానూ అప్పటి దాకా 'హస్త భూషణంగా' ఉన్న పుస్తకం తెరిచాను. స్టీఫెన్ లీకాక్ రచనల సంపుటం అది. అందులో "ది గోల్ఫ్ మానియాక్" అన్న టైటిల్ [illegible] చూపులు [illegible] రాయి.

నాలుగు లైన్లు చదవగానే 'హ్హ హ్హ హ్హ హ్హ' అని నవ్వడం మొదలెట్టాను.

నా పక్కన నిలబడున్నవాళ్లు ఉలిక్కిపడి, దడుచుకుని, తర్వాత నా వైపు సీరియస్‌గా చూడటం మొదలెట్టారు.

## రెండుజెళ్ళ సీత

"సారీ! హాస్య రచన చదువుతున్నాను!" అని సిగ్గుపడుతూ వాళ్ళకి సంజాయిషీ ఇచ్చి, పెదిమలు బిగించి, డొక్కలెగరేస్తూ, నవ్వాపుకుంటూ మిగతాది చదివాను.

లీకాక్ ఓసారి శుభమా అని రైల్లో ప్రయాణం చేస్తూ ఉంటే ఒక [illegible] తగులుతాడు. పరిచయం చేసుకుంటాడు. తనకి గోల్ఫ్ ఆట అంటే ప్రాణం అని చెప్పేస్తాడు.

అది మొదలు!

ఆ తర్వాత లీకాక్‌కి గోల్ఫ్ గురించి ఊదరగొట్టెయ్యడం మొదలెడతాడు. ఈ అనంత విశ్వంలోని ఏ సబ్జెక్టు గురించి మాట్లాడినా దాన్ని అతను అలవోకగా గోల్ఫ్ ఆటమీదికి మళ్ళించేస్తూ ఉంటాడు. రైలు దిగేలోగా తల దిమ్మెక్కిపోతుంది లీకాక్‌కి.

హాస్యం కోసం కొంచెం అతిశయోక్తులు రాశాడేమో అనిపించింది.



మరీ అంత విపరీతంగా ప్రవర్తిస్తారా ఎవరన్నా?... డాట్

నా డాటు తక్షణం తీర్చేస్తున్నానని నేనుదు అప్పుడే నిర్ణయం పెట్టినట్లు ఆ తర్వాత తెలిసింది.

టిక్కెట్టు చేతికొచ్చేసి తర్వాత హాయిగా ఊపిరి తీసుకుని, నింపాదిగా కాఫీ తాగి, హాల్లోకి వెళ్ళాను. అప్పటికే లైట్లు ఆర్పేశారు. న్యూస్ రీల్ జరుగుతోంది. సీటు నెంబరు కోసం వెతుక్కుంటున్నాను. 'కే- తొమ్మిది' నా నెంబరు

"మీ నెంబరు కే- నైనా సార్! ఇదే! రండి! కూర్చోండి!" అని మర్యాద చేశాడు ఒక ప్రేక్షకుడు

"థాంక్స్!" అని స్పష్టంగా నొక్కి. కూలబడ్డాను

"మీ ఒక్క సీటు తప్ప హాలంతా నిండిపోయింది మీరు రారేమో, ఒక సీటు అనవసరంగా వేస్టయిపోతుందేమో అని భయమేసింది! కమల హాసన్ పిక్చర్లో సీట్లు ఖాళీగా ఉండడం, అందులోనూ నష్టపడే, భరించలేను నేను థాంక్ గాడ్! మీరొచ్చేశారు!"

ఒకసారి అతన్ని వింతగా చూసి, నవ్వి ఊరుకున్నాను.

న్యూస్ రీల్ జరుగుతూనే ఉంది. అతనికి నామీదగల ధ్యాస నిలిచినట్టు లేదు.

"సార్! మీరు 'కే' వరసలోనే ఎందుకు తీసుకున్నారు సీటు? నా లాగా రావాలని 'కే' లోనే బుక్ చేయించు న్నారా ఏమిటి?"

"ఎందుకు?" అన్నాను తికమకగా


"నేనెప్పుడూ అంతే! కమలహాసన్ సినిమావస్తే 'కే' వరసలోనే బుక్ చేయించుకుంటాను! కె ఫర్ కమల్!" అన్నాడు ఆనందంగా

"ఓహో!" అన్నాను- ఇంకేమనాలో తోచక.

"మీది మంచి టేస్టు! మంచి సినిమాకి వచ్చారు" అని సర్టిఫికెట్ ఇచ్చాడు ఉదారంగా. సినిమా ఇంకా మొదలవకుండానే!

నేను వినయం అభినయించాను సినిమా మొదలయింది సరదాగా ఉంది సినిమా

కమలహాసన్ మొదటిసారిగా తెర మీద కనిపించగానే శివమెత్తినట్లు ఊగి



పోయి చప్పట్లు కొట్టాడు అతను కాసేపటి తర్వాత కమలహాసన్ పాట వచ్చినప్పుడు మొదట కుర్చీమీదా, ఆ తర్వాత నా వీపుమీదా దరువు వేశాడు పాటకి అనుగుణంగా కాళ్లు కదుపుతూ కుర్చీలో కూర్చునే డాన్సు లాంటిది చేశాడు.

ఇంటర్వెల్ వచ్చింది. "మధ్యలో ఈ ఇంటర్వెల్, పెంటర్వెల్ ఏమిటి" అని విసుక్కున్నాడు అతను. లైట్ల వెలుతురులో అతనివైపు పరీక్షగా చూశాను షర్టు జేబుమీద 'కే' అని అక్షరం. దానిపక్కనే ఒక కమలం ఎంబ్రాయిడరీ చేసి ఉన్నాయి బెల్టుమీద కూడా 'కే' అనే మోనోగ్రామ్ ఉంది.

"మీ పేరేమిటి సార్?" అన్నాడు చెప్పాను.

"నా పేరు అనూప్" అన్నాడు

"మరి షర్టుమీదా, బెల్టుమీదా 'కే' ఏమిటి?" అని నేను అడగలేదు 'కె ఫర్ కమల్' అని అర్థమైపోయింది.

"వెరీ గామ్యూ మీచ్యూ!" అంటూ కరచాలనం చేశాడు అనూప్. తర్వాత నా చెయ్యి నాకు ఇచ్చెయ్యకుండా, దాన్ని బరబరా ఈడ్చుకుంటూ ఫాయర్ లోకి తీసుకెళ్ళి, స్టిల్సు చూపించు లాగాడు. పరవశంగా చూస్తూ, "ఈ నాలుగు సీన్లూ వచ్చేశాయి కదండీ. మిగతా నాలుగూ ఇంకా రావాలన్నమాట! అబ్బ! ఆ పోజు చూడండి, కమల్ ఎంత బావున్నాడో!" అన్నాడు.

నేను చూస్తూనే ఉన్నాను. కానీ చూసింది మెదడుకి ఎక్కట్లేదు. నా మనసంతా టాయిలెట్సు వైపు ఉంది. అసలే చలికాలం! అర్జెంటు! నా చేతి మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి. చెయ్యి విడిపించుకోబోయాను.


కానీ వదలదే! కళ్ళేసినట్లు నన్ను పట్టేసుకున్నాడు అనూప్.

నాకు కళ్ళెంబడి నీళ్లు తిరిగడ మొక్కటే తక్కువ!

తర్వాత కూల్‌డ్రింక్సు పార్లర్ దగ్గరికి లాక్కెళ్ళి కోలా తాగించాడు నేను డబ్బు లివ బోయినా ఇవ్వనివ్వలేదు. తనే జేబులో చెయ్యిపెట్టి ఐదు రూపాయల నోటు తీశాడు. ఆ కార్యక్రమంలో ఒక్క క్షణం నా చెయ్యి వదలగానే తక్షణం ఆ అవకాశం సద్వినియోగం చేసుకుని స్ప్రింగులా దూసుకుపోయాను.

అమ్మయ్య! ఎంత రిలీఫో.

అబ్బాయికింకా కుర్రతనం పోలే.....



మళ్ళీ సినిమా చూశాం.

క్లయిమాక్సులో కమలహాసన్ రైల్వే ప్లాట్‌ఫారం మీద ట్రాజెడీ యాక్షన్ చేస్తున్నప్పుడు సీట్లోనుంచీ లేచిపోయి, పెద్దగా విజిలేశాడు అనూప్.

సినిమా వదిలారు గానీ అతను నా చెయ్యి వదలలేదు.

బయటికి వచ్చాం.

మంచి సినిమా చూశానన్న తృప్తి కలిగింది నాకు.


"సార్! మనిద్దరం కలిసి ఒక థ్రిల్లింగ్ అనుభవం షేర్ చేసుకున్నాం! అందుకని మనిద్దరం కలిసి పార్టీ చేసుకోవాలి! ఒక్క పది నిము షాలు నాతో స్పెండ్ చెయ్యండి!" అన్నాడు అనూప్.


"థ్రిల్లింగ్ అనుభవమా?" అన్నాను అర్థంకాక.

"అవున్సార్! కమలహాసన్ పిక్చర్ చూడడం అంటే థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్సేముంటుంది? ఒక్క పది నిముషాలు.. కమలహాసన్ పిక్చర్లో నా పక్కన కూర్చున్నవాడికి కాఫీ తాగించకుండా వదలను నేను! అది నా ఆచారం!" అన్నాడు.

"నాకు అర్జెంటు పని ..." అని ఏదో చెప్పబోయాను, తప్పించుకోవడానికి.

"ఏముంది అంత అర్జెంటు? అవతల నా వైఫ్‌కి డెలివరీ టైము! నెప్పులు






పడుతోంది. అయినా నేను వచ్చెయ్య లేదూ? మరేం మాట్లాడకుండా పదండి!" అని నన్ను మరో మాట మాట్లాడనివ్వకుండా గెంటుకుంటూ వేసుకెళ్లాడు.

అతని చేతిలో ఉన్న నా చెతికోసం పరిగెత్తుకుంటూ వెళ్లాను.

మధ్యలో ఒక పుస్తకాల షాపు కన బడింది. వెంటనే మంత్రం వేసిన వాడిలా ఆగిపోయాడతను.

"అరె! అరెరె! 'సినిమాపత్రిక' కవర్ పేజీ కమల్ అందోయ్ బాబూ! కొనెయ్యకపోతే కళ్లు పోతాయ్!" అంటూ చటుక్కున షాపులో దూరి పోయి 'సినిమాపత్రిక'తో బాటు కమల హాసన్ ఫోటో ఉన్న మరో అరడజను పత్రికలు కొన్నాడు. ఆ తర్వాత రీడర్స్ డైజెస్ట్ అందుకుని పర పర పేజీలు తిప్పి, చిదరగా మొహం పెట్టి దాన్ని విసురుగా గిరవాటేశాడు "ఇదసలు ఇంటర్నేషనల్ మేగజైన్ ఎలా అయిందండీ కమల్ ఫోటో ఒక్క సారన్నా వేశారా వీళ్లు!" అన్నాడు. రీడర్స్ డైజెస్టు కమల్ ఫోటోని వెయ్యలేకపోవటమనే అప రాధాన్ని తను డైజెస్టు చేసుకోలేనట్లు!

అక్కడ నుంచి హోటల్‌కి ప్రయాణం కట్టించాడు.

కూర్చున్న తర్వాత సర్వర్ రాగానే "ఏమోయ్ సర్వారావ్! కా తో స్టార్ట్ అయ్యేవి ఏమేం ఉన్నాయ్?" అన్నాడు

సర్వరు బిత్తరపోయి చూస్తూ. "ఏమిటి సార్?" అన్నాడు

"అదేనయ్యా బాబూ! 'క' అనే అక్షరంతో మొదలయ్యే పదార్థాలు ఏమేం ఉన్నాయ్?"

"కారట్ హల్వా, కాజు పకోడా, కాబేజ్ వడా, కారబూందీ........"


"ఆహా! అయితే అన్ని రకాని కొకటి చొప్పున తెచ్చెయ్! ఇవాళ అంతా 'క' తోనే గడిచిపోవాలి. కే ఫర్ కమల్!" అన్నాడు.

కారట్ హల్వా. కాజూపకోడా వచ్చాయి

"ఇంకేం సినిమాలు చూశారు మీరు?" అన్నాడతను పకోడీ తుంచుతూ.

"మేము సందేశం ... ... ..." అన బోయాను.

పకోడి నోట్లో పెట్టుకోబోతున్న అతను ఆగి, తెగులు తగిలిన కోడి



లాగా చూశాడు. సంభాషణ ట్రాక్ మారి, తప్పుదోవన పక్కకెళ్ళి పోతున్నట్లు అనుమానం వచ్చింది అతనికి. మొహంలో అశాంతి చోటు చేసుకుంది.

"మేక సందేశమూ, తోక సందేశమూ కాదండి బాబూ! కమల్ పిక్చర్లు ఇంకేం చూశారు?"

"అన్నీ చూసేశాను" అన్నాను.


"అమావాస్య చంద్రుడూ, టిక్ టిక్ టిక్ మళ్ళీ వచ్చాయిగా! చూళ్లేదా?"

"ఇదివరకే చూసేశాను".

"అనూప్ నా వైపు ఎగతాళిగా చూశాడు".

"అదేమిటి! కమల్ పిక్చర్లు ఒక్కసారే చూసి ఊరుకుంటారా మీరు! మిమ్మల్ని చూస్తుంటే ఒక జోక్ గుర్తొస్తోందండీ. మీలాంటి వాణ్ణే ఎవణ్ణో ఒక పెద్దమనిషి అడిగాడుట "సిగరెట్ కాలుస్తారా?" అని. "లేదు ఒకసారి కాల్చిచూశాను. నచ్చలేదు." అన్నాడుట ఆయన.

"పోనీ విస్కీ తాగుతారా?"



"లేదు! ఒకసారి తాగిచూశాను నచ్చలేదు."

"సరే! నాన్ వెజ్ తింటారా?"

"వద్దు! ఒకసారి తినిచూశాను. నచ్చలేదు."

ప్రశ్న లడుగుతున్న పెద్ద మనిషికి ఒళ్ళుమండి "బహుశా మీకు ఒక్కళ్ళే సంతానం అయివుంటారు! అవునా?" అన్నాడు బోలెడంత అర్థం గుప్పించేస్తూ" అని చెప్పి నవ్వాడు అసూప్. "మన్లోమాట! మీకెంత మంది పిల్లలండి?"

నా గొంతుకి వచ్చి వెలక్కాయ అడ్డం పడ్డట్లు అయింది. నాకు ఒక్కతే కూతురు. అదే చెప్పాను హీన స్వరంతో.

విజయ గర్వంతో నవ్వాడు అసూప్. "అప్పుడే కనిపెట్టేశానండీ! కమల్ పిక్చర్స్ ఒక్కసారే చూస్తారని చెప్పగానే ఆ సంగతి అర్థమై పోయింది నాకు!"

దారుణమైన అతని అపోహని ఎలా దూరం చెయ్యాలో అర్థంకాక గింజుకున్నాను. కొన్ని విషయాలకి ముజావులు ఉండవు మరి!

"మీ కెంత మంది పిల్లలు?" అన్నాను మాటవరసకి.


"ఇద్దరు- అమ్మాయి పేరు వాణి, అబ్బాయి పేరు గణపతి. కమల్ భార్య పేరు వాణీ గణపతి కదా! అందుకే మా పిల్లలకు ఆ పేర్లు పెట్టాను. పిల్లలంటే గుర్తొచ్చింది. కమలహాసన్ ఇంత పిల్లాడిగా ఉన్నప్పటి నుంచీ సినిమా ఫీల్డులోనే ఉంటున్నాడు. అందుకే ఇవాళ అందర్నీ షేక్ చేసేస్తున్నాడు మరి!"

"అవును! ఒకమే" అని ఒప్పుకున్నాను. "మంచియాక్టరతను లైట్ కామెడీ అద్భుతంగా చేస్తాడు." అన్నాను.

అసూప్ మొహం పెద్ద సైజు కమలంలా వికసించింది.

కొంచెం సేపు ఉపన్యాసంలా కమల్ యాక్షన్ గురించి చెప్పాడు. ఏకీభవించాను.

"ఇంకేమన్నా ప్రోగ్రాములకి అటెండ్ అవుతుంటారా? డాన్సులు.. అవీ...." అని అడిగాను కుతూహలంగా.






"లేదండీ". అన్నాడతను చిరాగ్గా వెంటనే "డాన్సంటే గుర్తొచ్చింది. ...కు తెలుసా? కమలహాసన్ మొదట్లో డాన్స్ డైరెక్టర్‌గా ఉండేవాడు." అన్నాడు.

"అవును. విన్నాను" అన్నాడు తర్వాత. 'బుక్సేమన్నా చదువుతంటారా? లీకాక్ మీకు ఇష్టమేనా ?" అన్నాను, నా చేతిలోని బుక్కు చూపిస్తూ.

"లీకాకా? లేదు. లీకాక్ అంటే గుర్తొచ్చింది. కమల్ షటిల్‌కాక్ ఆడతాడుట. తెలుసా?" అన్నాడు.

కాస్త వ్యవధిఇచ్చి, "రాజ్‌కపూర్ అంటే ఇష్టమేనా మీకు? ప్రేమ్‌రోగ్ చూశారా. అన్నాను.

"అలాంటి వన్నీ చూసే రాగం లేదండీ నాకు. రాజ్‌కపూర్ అంటే గుర్తొచ్చింది. రాజ్‌కపూర్ ఫ్యామిలీ అంతా సినిమాల్లో చేరిపోయినట్లు న కమల్ కుటుంబం అంతా కూడా సినిమాల్లో కొచ్చేస్తున్నారు తెలుసా, కమలహాసన్, చారుహాసన్, సుహాసిని...."

నేను మొన్న ఛార్లీ చాప్లిన్‌ది 'మోడర్న్ టైమ్స్' చూశాను." అని అన్నాను మాట మార్చాలని.


"ఛార్లీ చాప్లినా. అతను మరిఇదిగా ఇమిటేట్ చేస్తాడండీ కమలహాసన్‌ని. కమల్‌ది గుబురు మీసం అయితే అతనిది ఫ్రెంచ్‌కట్ మీసం. అంతే తేడా" అన్నాడు.

"ఛార్లీ ఛాప్లిన్ చాలా పాత.... అనబోయాను. అతను నన్ను సగంలోనే కట్‌చేసి, "పాత అంటే గుర్తొచ్చింది, కమలహాసన్ పాత సినిమా 'ఇది కథ కాదు' చూశారా, అందులో అచ్చం స్ప్రింగు బొమ్మలా ఒక డాన్సు చేస్తాడు గుర్తుందా. అది కాపీ కొట్టేసి పొక ఇంగ్లీషు సినిమాలో పెట్టుకున్నారుట" అన్నాడు.

చిట్టీ చిట్టీ బ్యాంగ్ బ్యాంగ్‌లో డిక్ వాన్ డైక్‌ది అలాంటి డాన్సే ఉంది." అన్నాను నేను నిస్పృహగా.

ఇంక ఆ సంభాషణ ధోరణి మార్చాలని నాకు తీవ్రంగా అనిపించింది. అందుకని సినిమా ఫీల్డుకి బొత్తిగా సంబంధం లేని టాపిక్ ఎత్తాను.

"మంచి బెల్టులెక్కడ దొరుకుతాయి సార్? కొంచెం పొట్టవచ్చేసి పాంటు నిలవట్లేదు. జారి జారి పోతోంది." అన్నాను.




"మీరు ఎక్కడ కొన్నారు? నేరో బెల్టే కొనండి! కమల్ అలాంటి బెల్టే పెట్టుకుంటాడు తర్వాత ఒళ్ళు రాకుండా ఉండాలంటే కమల్‌లా రోజు ఎక్సర్‌సైజ్...."

ఇండియా పరిస్థితి ఎలా ఉందంటారూ?" అన్నాను నేను ఆర్తనాదం లాంటిది చేస్తూ.

"ఆఁ! ఏముందండీ ఇండియా పరిస్థితి! ఆదేశం దగ్గరా ఈ దేశం దగ్గరా అప్పులు తెచ్చుకు తినడమేగా! అప్పులంటే గుర్తొచ్చింది! కమల్ అప్పుల గురించి చెప్పిన జోక్ మీకు తెలుసా? కరాటే నేర్చుకోవడం వల్ల ఒక లాభం ఉందని చెప్పాడు కమల్. ధీమాగా అప్పులు అడగొచ్చుట, ధైర్యంగా అప్పులు వసూలు చేసుకోవచ్చుట! వెరీఫన్నీ! కదూ?"

ఒక్కసారి గట్టిగా తల విదిలించాను ఇంక అతనితో కలిసి ఉన్నంతసేపూ ఆ సంభాషణ తప్ప మరోటి చెల్లదని అర్థమైపోయింది. అందుకని వీరోచితంగా ఈసారి నేనే కదిలించాను.

"ఎలా ఉంది వసంతకోకిల?" అన్నాను.

అతను తక్షణం మహా అలర్టుగా అయిపోయి "ముందు మీకెలా ఉంది చెప్పండి!" అన్నాడు. అతనిగొంతులో ప్రాణభయం చోటు చేసుకుంది.

"నైస్‌మూవీ! మంచి ఎంటర్‌టైన్



...ంటు!" అన్నాను.

అతని ముఖకవళికలు వెంటనే మారిపోయాయి. గొంతు కటువుగ మారింది.

"కాదు! మీరు పొరబడ్డారు! అది నైన్స్‌మూవీ కాదు! మంచి ఎన్‌టర్‌టైన్‌మెంటు అసలేకాదు!"


"మరి?" అన్నాను విస్మెరపోయి.

"అది అసలుసిసలైన కళాఖండం! మాగ్‌సేసే అవార్డుఇవ్వాల్సినచిత్రం"

"మాగ్‌సేసే అవార్డు జర్నలిజానికి ఇస్తారనుకుంటాను. మీరనుకునేది బహుశా ఆస్కార్ ...."

"ఆస్కారో గిస్కారో, ప్రపంచంలోకెల్లా అతి గొప్ప అవార్డు ఏదిఉంటే అది ఈ పిక్చర్‌కి ఇవ్వాలి! దీనికేకాదు! కమల్ నటించిన ప్రతి చిత్రానికీ ఇవ్వాలి! ఇంతమంచిపిక్చరు మీకు కేవలం 'నైన్స్‌మూవీ'లా కనబడిందా? మీలో ఏదో లోపం ఉంది!"

"అహా! అలా కాదు!" అన్నాను సంజాయిషీ చెబుతూ, "కొన్ని చోట్ల చాలా టచింగ్‌గా, సున్నితమైన హాస్యాలతో హృదయాన్ని తాకేటట్లు చేశాడు కమలహాసన్. చివర్లో అతను బండల మధ్య పడుకుని ఆదుర్దాగా ఆశ్రమం





వైపు చూసే సీన్లో 'అయ్యోపాపం' అని సానుభూతి కలుగుతుంది. కానీ క్లయిమాక్సులో రైల్వే ప్లాట్‌ఫారం మీద ప్లాట్‌ఫారం పట్టినంత ఓవరాక్షన్ చేసినప్పుడు మాత్రం ఆ సింపతీ తగ్గిపోతుంది. అఫ్‌కోర్స్! కొంచెం ఓవర్ చేస్తేనే ప్రేక్షకులకు నచ్చుతుందని అతనికి తెలుసని నాకు తెలుసు. ఏమైనా, ఇది కేవలం నా పర్సనల్ టేస్టు, అంతేకాక కథపరంగా చాలా లూజ్ ఎండ్స్ ఉన్నాయి. మచ్చుకి....

"సర్వర్! మిగతా టిఫిన్లు కాన్సిల్ ఇంక వేరే ఏమీ తేకు!" అని అరిచాడు "మరి ఇందాక మీకు కూడా కమల్ అంటే ఇష్టమైనట్లు మాటాడారే? ఇప్పుడిలా ప్లేటు మార్చారేమిటి?" అన్నాడు ఆరోపణగా.

"నాకు కమల్ హాసన్ అంటే ఇష్టమే! కాని నేను సినిమాలు విమర్శగా చూస్తాను"

"మీరు పిల్లకాయతనంగా మాట్లాడుతున్నారు. కమల్ చేసే ప్రతి బిట్టూ పరమాద్భుతంగా తప్ప మరోలా ఉండడానికి వీల్లేదు. మీకు కమల్ అంటే ఏదో గ్రడ్జ్ ఉంది".

"చూడండి! ట్రాన్‌సల్ అంటే నాకు చాలా అభిమానం. అయినా కొన్ని సినిమాల్లో అతను బాగా చెయ్య




లేదని ఏమర్చిస్తూ ఉంటాను నేను. అలాగే...."

స్ప్రింగులా లేచి నిలబడ్డాడు అనూప్.

"వస్తాను. నేను అర్జెంటుగా వెళ్ళాలి" అన్నాడు టైం చూసుకుంటూ.

అతన్ని నొప్పించినందుకు గింజుకుంటూ, "హాస్పిటల్‌కి వెళ్తున్నారా? మీ భార్యకి డెలివరీ టైం అని చెప్పారు కదా?" అన్నాను.

అనూప్ నన్ను పురుగుని చూసినట్లు చూశాడు. "హాస్పిటల్‌కి కాదు. వసంత కోకిల మళ్ళీ సెకెండ్ షో చూడాలి!" అన్నాడు.

"ఇప్పుడు క్యూలో నించుంటే టిక్కెట్లు దొరుకుతాయా? అసలే ఫస్ట్ డే" అన్నాను నేను.

"అందుకే ముందరే వరసగా రెండు షోలకీ టిక్కెట్లు బుక్ చేయించుకుంటాను. ఇదిగో 'కే' పెన్, అంటూ మాంత్రికుడు టోపీలో నుంచి కుందేలుని తీసినట్లు జేబులోనుంచీ టిక్కెట్లు తీశాడు.

నోట మాట రాకుండా కొయ్యబారి పోయాను నేను.

అతను వెళ్ళిపోతూ ఒక్కసారి వెనక్కి తిరిగాడు. నావైపు సూటి చూస్తూ. "సార్! మీ ప్రవర్తన చాలా అసహజంగా ఉంది. సాధ్యమైనంత త్వరలో సైక్రియాట్రిస్టుకి చూపించుకోండి! లేకపోతే పిచ్చి ముదరగలదు" అని ఉచిత సలహా పారేసి, విసవిస నడుస్తూ వెళ్ళిపోయాడు; "నైస్ మూవీట! నైస్ మూవీ! కళాఖండాన్ని పట్టుకుని......" అని అతడు గొణగడం వినబడింది.

నాకు పిచ్చి పడుతుందేమోనని ఒక్కక్షణం నిజంగానే భయమేసింది.

(ఇందులో కొంతమంది నటీనటుల పేర్లు ఉపయోగించుకోవడం కేవలం కథాసౌలభ్యం కోసమే తప్ప మరేమీ కాదని మనవి).

★ ★ ★

